రైతు బజార్ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపనలో పాల్గొన్న చైర్‌పర్సన్ రాధిక, అధికారులు

తెనాలిరూరల్: స్థానిక కొత్తపేటలో శాశ్వత రైతు బజార్ ఏర్పాటుకు మున్సిపల్ యంత్రాంగం సమాయత్తమైంది. ఇందుకు సంబంధించి ఎల్‌ఐసీ ఆఫీసు వద్ద గల పురపాలక సంఘానికి చెందిన ఖాళీ స్థలంలో సోమవారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్ వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, 15 వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వర రావు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నలు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బోస్ రోడ్డులో ఉన్న రైతు బజార్ వినియోగదారులకు ఇబ్బందికరంగా ఉండటమే కాక ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్న నేపథ్యంలో రైతుబజార్‌ని ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద గల ఖాళీ స్థలంలోకి మార్చేందుకు ఇక్కడ శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. రూ. 15 లక్షలతో నిర్మించే రైతు బజార్‌లో, ఎనిమిది దుకాణాలు, ఒక ఆఫీస్ రూం ఉంటుందని వారు తెలియజేశారు. ఇంకా ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజినీర్ ఆకుల శ్రీనివాసరావు, అసిస్టెంట్ ఇంజినీర్ సూరిబాబు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

కొల్లిపర: అక్రమంగా విధుల నుంచి తొలగించిన చేబ్రోలు పంచాయతీ కార్మికులను వెంటనే తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములక శివసాంబిరెడ్డి కోరారు. సీఐటీయూ, ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో చేబ్రోలు పంచాయతీలో తొలగించిన కార్మికులకు అండగా సోమవారం కొల్లిపర పంచాయతీ కార్యాలయం వద్ద మండలంలోని కార్మికులతో వారికి మద్దతుగా నిరసన ప్రదర్శన నిర్వహించారు ఈ కార్యక్రమంలో గోదా సుందరరావు, మల్లోల రమేష్, సీతమ్మ, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

రెండు ఇసుక లారీలు సీజ్

కొల్లిపర: మండలంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక లారీలు, ఒకటి ఇసుక లేకుండా ఉన్న లారీ ను సోమవారం సీజ్ చేసినట్లు ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాయంత్రం వాహనాలు తనిఖీలో భాగంగా కృష్ణా నది కరకట్ట పై తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు లారీలలో ఇసుక రావటం గమనించి వాటిని నిలిపి డ్రైవర్ల వద్ద నుండి వాహన పత్రాలు, ఇసుక వేబిలు పరిశీలించగా వారి వద్ద ఎటువంటి వే బిల్లు లేకపోవటం, మరొక లారీ డ్రైవరు వద్ద ఎటువంటి వాహన పత్రాలు లేక పోవటంతో కేసు నమోదు చేసి రెండు ఇసుక లారీలను స్థానిక తహసీల్దారుకు బదిలీ చేసినట్లు తెలిపారు.

15వ వార్డులో శానిటేషన్ డ్రైవ్

తెనాలిరూరల్: పట్టణంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు పురపాలక సంఘం స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రజలు కూడా పారిశుద్ధ్యం పట్ల వారి బాధ్యతను తెలియజేస్తూ 15వ వార్డులో సామూహిక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికరమేష్, వార్డు కౌన్సిలర్ గుంటూరు కోటేశ్వర రావుతో కలిసి వీధి వీధిలో పారిశుధ్య పనులను పరిశీలించామని చైర్‌పర్సన్ తెలిపారు.

ఐఐటీలో సీటు సాధించిన గుణశ్రీకి సత్కారం


గుణశ్రీ, తల్లిదండ్రులను సత్కరించిన మురళీకాంత్

తెనాలి: విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో సాధించుకోవాలని నెహ్రూనికేతన్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ వి.దాసరి సూచించారు. ఇందుకు మీ మధ్యనే చదివి ఉన్నత చదువులకు ఎంపికైన విద్యార్థినిని స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. ఒకటో తరగతి నుండి పదోతరగతి వరకు నెహ్రూ నికేతన్‌లో విద్యాభ్యాసం చేసి, ఐఐటీ, చెన్నైలో సీటు సాధించిన కామినేని గుణశ్రీ అభినందన సభను సోమవారం పాఠశాలలో ఏర్పాటుచేశారు. గుణశ్రీతోపాటు ఆమె తల్లిదండ్రులు రాజ్యలక్ష్మి, శేఖర్‌ను మురళీకాంత్, ఉపాధ్యాయులు సత్కరించారు. విద్యార్థుల స్థాయికి తగిన సిలబస్‌తో ఒలింపియాడ్ వంటి పోటీపరీక్షలకుపంపుతూ విద్యార్థులకు ఒత్తిడి లేని విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఫలితంగానే తమ విద్యార్థులు మంచి ఫలితాలను సాధిస్తున్నారని అభిప్రాయపడ్డారు. గుణశ్రీ మాట్లాడుతూ ఇదే విద్యాసంస్థలో పోటీ పరీక్షలు, ఐఐటీ ఫౌండేషన్ కోర్సులో శిక్షణ తనకు ఐఐటీలో సీటు సాధించేందుకు దోహదపడిందని చెప్పారు. పాఠశాలస్థాయి పలు ఒలింపియాడ్‌లో పాల్గొన్నట్టు గుర్తుచేసుకున్నారు. విద్యార్థులు బాల్యంనుంచి ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాలన్నారు. ఇష్టంతో చేస్తే ఏ పనీ కష్టం కాదన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వరప్రసాద్ ఆశయాలు కొనసాగించడమే నివాళి

సినీ మాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా

తెనాలి: అనుబంధం, ఆత్మీయత మేళవించిన మానవతావాది డాక్టర్ జీవీఎస్ఆర్ఎస్ఎస్ఎస్ వరప్రసాద్ ఆశయాలను కొనసాగించడమే ఆయనకిచ్చే నిజమైన నివాళిగా ప్రముఖ సినీమాటల రచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా అన్నారు. ఇటీవల ఆకస్మికంగా మృతిచెందిన విజయవాడకు చెందిన ప్రముఖ న్యాయవాది, కళాపోషకుడు, వేదగంగోత్రి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ జీవీఎస్ఆర్ఎస్ఎస్ఎస్ వరప్రసాద్ సంస్మరణను సోమవారం సాయంత్రం ఇక్కడి తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటుచేశారు. పట్టణానికి చెందిన కళల కాణాచి ఆధ్వర్యంలో ఏర్పాటైన సభకు సంస్థ ఉపాధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. వ్యవస్థాపక అధ్యక్షుడైన డాక్టర్ సాయిమాధవ్ బుర్రా మాట్లాడుతూ కళల కాణాచి తరపున వీణా అవార్డ్స్ నాటక పోటీల నిర్వహణ వరప్రసాద్ ఆలోచన ఫలితంగానే ఆచరణలోకి వచ్చిందని గుర్తుచేసుకున్నారు. సంపాదనను కేవలం మంచికే వినియోగించాలని భావించిన వ్యక్తి వరప్రసాద్ స్మారకార్థం ఇకపై వీణా అవార్డ్స్ నాటకపోటీల్లో బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి, డాక్టర్ ఏఆర్ కృష్ణ అవార్డులతోపాటు 'వేదగంగోత్రి వరప్రసాద్ నిర్వహణ పురస్కారం' ప్రదానం చేయనున్నామని ప్రకటించారు. నాటక సమాజాల నిర్వాహకులకు మాత్రమే ఈ పురస్కారాన్ని రూ.11,116 నగదుతో అందజేస్తామని చెప్పారు. ఇదే వేదికపై నాటికలు/నాటకాలతో ఆకుల మల్లేశ్వరరావు తీసుకొచ్చిన 'రంగ విపంచిక' పుస్తకాన్ని ఆవిష్కరించారు. తొలుత శిష్టా రాజ్యలక్ష్మి జ్యోతిప్రజ్వలన చేశారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, వేమూరి విజయభాస్కర్, తాడిబోయిన హరిప్రసాద్, గోగినేని కేశవరావు, కె.పూర్ణచంద్, వేదగంగోత్రి ఫౌండేషన్ డైరెక్టర్ శిష్టా రవితేజ, గోపరాజు విజయ్, దేవరపల్లి భవాని, వసంతయామిని, కె.సౌజన్య పాల్గొన్నారు. సభానంతరం న్యూ మోడ్రన్ థియేటర్స్, విజయవాడ వారి 'కాంట్రా వర్సీ' నాటికను ప్రదర్శించారు. రచన, దర్శకత్వం డాక్టర్ ఎం.ఎస్.చౌదరి వహించారు.

సంక్షిప్త వార్తలు

■ గ్రీవెన్స్‌కు నాలుగు ఫిర్యాదులు

తెనాలిరూరల్: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ స్వప్నిల్, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ పాల్గొన్నారు. మండల పరిధిలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల అర్జీలు తీసుకుని వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. మొత్తం నాలుగు అర్జీలు రావడం జరిగిందని వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని అసిస్టెంట్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. అలానే మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ బండి శేషన్న ప్రజల నుంచి ఫిర్యాదులు సేకరించారు. రోడ్ల నిర్మాణం, అక్రమ కట్టడం కూల్చివేత, కొళాయి కనెక్షన్ల తొలగింపుపై ఫిర్యాదులు వచ్చినట్టు కమిషనర్ తెలిపారు.

■ పేదల భూమి అమ్మడం తగదు

తెనాలి: 1991లో చుండూరు మారణకాండలో మృతి చెందిన మాల,మాదిగల కుటుంబాలకు నాటి ప్రభుత్వం జీవనం కోసమని 16 ఎకరాల భూమిని కేటాయించగా, ప్రస్తుతం ఆ భూమి తనదేనంటూ సంబంధం లేని వ్యక్తి అమ్మకానికి సిద్ధమవడం తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ఉన్నం ధర్మారావు మాదిగ అన్నారు. చుండూరుకు చెందిన దళిత రైతులతో కలిసి సోమవారం ఆయన తెనాలిలో ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. చుండూరు బాధితుల కుటుంబాలు 32 మందికి 50 సెంట్ల చొప్పున తెనాలి-గుంటూరు రోడ్డులోని బుడంపాడు గ్రామంలో భూమిని కేటాయించారని ఆయన తెలిపారు.

■ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో 8 అర్జీలు

తెనాలి: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ సమావేశంలో సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఏకరువు పెట్టి, అర్జీలను అందచేశారు. రెవెన్యూ/సర్వేకు సంబంధించి మూడు అర్జీలు రాగా, వ్యవసాయశాఖ, మున్సిపాలిటీ, పోలీస్, మంచినీటి సరఫరా, డ్రెయినేజీలకు సంబంధించి ఒక్కొక్క అర్జీ వచ్చాయని సబ్‌కలెక్టర్ సంజనా సింహ వెల్లడించారు. అర్జీలను సంబంధిత అధికారులకు పంపి, నిర్ణీత సమయంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

■ రాళ్లు సరిచేసి.. రోడ్డు బాగుచేసి..



సాక్షి ఎఫెక్ట్

తెనాలి: కీలకమైన రహదారిలో రెండు పంటకాల్వలపై గల వంతెనల మధ్య సిమెంటు రోడ్డుకు ఎట్టకేలకు మరమ్మతులు జరిగాయి. పట్టణంలోని పడమర కాల్వ, నిజాంపట్నం కాల్వలపై గల వంతెనల మధ్య రోడ్డులో కొంతమేర తవ్వేసి, ఆ రాళ్లను కూడా తొలగించకుండా అలాగే వదిలేశారు. దీనిపై 'సాక్షి' ప్రచురించిన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. అక్కడ మరమ్మతులు చేసి, రాళ్లను రోడ్డుపక్కన వేశారు. రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేశారు.

13న 'మట్టిమనిషి' నాటక ప్రదర్శన

నాటక రూపంగా వాసిరెడ్డి సీతాదేవి నవల


బ్రోచర్‌ను ఆవిష్కరించిన శివప్రసాద్

తెనాలి: తెనాలి ప్రాంతానికి చెందిన ప్రఖ్యాత రచయిత్రి వాసిరెడ్డి సీతాదేవి రచించిన 'మట్టిమనిషి' నవల నాటకరూపం సంతరించుకుంది. ప్రముఖ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ ఈ నవలను నాటకీకరించారు. ప్రముఖ నటుడు, దర్శకుడు ఎస్.ఎం బాషా దర్శకత్వంలో 'మట్టిమనిషి' నాటకాన్ని ఈనెల 13న తెనాలిలో ప్రదర్శించనున్నారు. సంబంధిత బ్రోచర్‌ను సోమవారం తెనాలిలో ఆవిష్కరించారు. స్థానిక గాంధీనగర్‌లో విలేకరుల సమావేశంలో వల్లూరు శివప్రసాద్ వివరాలను తెలియజేశారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఆరోజు సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్‌కు చెందిన మిత్ర క్రియేషన్స్‌చే 50 మంది నటీనటులు, సాంకేతిక నిపుణుల బృందంతో ఈ నాటకాన్ని ప్రదర్శిస్తారు. భూమికి, మనిషికి మధ్య గత తాత్విక అనుబంధంపై లోతుగా చర్చించిన మట్టిమనిషి నవలను ఉస్మానియా యూనివర్సిటీ ఎంఏ ఫైనల్ విద్యార్థులకు పాఠ్యాంశం (1995-2000)గా ఉంది. నేషనల్ బుక్‌ట్రస్ట్, ఇండియా మట్టిమనిషి నవలను 14 భారతీయ భాషల్లోకి అనువదించి ప్రచురింపజేశారు. మాస్టర్ పీసెస్ ఆఫ్ ఇండియన్ లిటరేచర్ అనే కాలంలో ప్రస్తావించిన-నన్నయ్య నుంచి నేటివరకు వెయ్యిసంవత్సరాల తెలుగు సాహిత్యంలో వచ్చిన గొప్ప రచనల్లో మట్టిమనిషి నవల 13వదిగా పేర్కొన్నట్టు శివప్రసాద్ గుర్తుచేశారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు మాట్లాడుతూ, అరసం జిల్లా ఉపాధ్యక్షుడు కనపర్తి బెన్‌హర్, ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, కొండముది రమేష్, పోపూరి రామమోహనరావు, బి.హృదయరాజు, వెనిగళ్ల శివప్రసాద్ పాల్గొన్నారు.

ఆధునికతకు కేరాఫ్ తెనాలి

- ఏటికేడాది విస్తరిస్తున్న ఆంధ్రాప్యారిస్
- విద్య, వైద్య, వ్యాపారాలకు కొదవలేని పట్టణం


రణరంగచౌక్‌లోని అమరవీరుల స్థూపాలు


తెనాలి సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన భారీ గణపతి విగ్రహం

తెనాలి: ఆంధ్రాప్యారిస్ తెనాలి సుమేరియన్ నాగరికత కాలం నుంచి ఉన్న పట్టణం. కాలానుగుణంగా ఏటికేడాది విస్తరిస్తోంది. 1909లో మున్సిపాలిటీగా మారింది. తర్వాతి కాలంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఏకైక స్పెషల్‌గ్రేడ్ మున్సిపాలిటీ హోదాతో కొనసాగింది. మూడేళ్లక్రితం సెలక్షన్ గ్రేడ్ హోదాకు ఎదిగింది. కార్పొరేషన్ స్థాయికి కేవలం ఒక మెట్టు దూరంలో నిలిచింది. మున్సిపాలిటీ హోదాతో పాటు పట్టణం విస్తరించటమే కాకుండా ఆధునికతను సంతరించుకుంటోంది. సంప్రదాయ వృత్తులను, వ్యాపారాలను కొనసాగిస్తోంది. ఇంకోవైపు అన్ని రంగాల్లోనూ బ్రాండెడ్ రంగప్రవేశం చేస్తుండటం మరో ప్రత్యేకత! పట్టణంలో పలు కార్పొరేట్ వైద్యశాలలు నెలకొన్నాయి. గుండెకు సంబంధించిన అధునాతన పరీక్షలు, ఆపరేషన్లు మినహా మిగిలిన అన్నిరకాల కార్పొరేట్ వైద్యాన్ని అందించే ఆస్పత్రులు ఇప్పుడు పట్టణంలో నలుదిశలా ఏర్పడ్డాయి. ప్రత్యేకించి పిల్లలకు సంబంధించిన వైద్యశాలలు, కంటి వైద్యశాలలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. భారీ వస్త్ర దుకాణాలు, బ్రాండెడ్ రెడీమేడ్ షోరూంలు, చివరకు అంతర్జాతీయ బ్రాండెడ్ సెలూన్లు / బ్యూటీపార్లర్లు ప్రజల ఆదరణను పొందుతున్నాయి. వెండి, బంగారు నగల వ్యాపారానికి రాష్ట్రంలో విజయవాడ తర్వాత తెనాలి ప్రసిద్ధి అని తెలిసిందే. ఆ క్రమంలోనే ఇక్కడ వెండి, బంగారు నగల దుకాణాలు తెనాలితోపాటు పలు నగరాల వినియోగదారులను ఆకర్షిస్తున్నాయి. ఇక ఆహార రంగంలోనూ తెనాలికి తిరుగులేదు. తెనాలి భోజనం రుచులను ప్రసిద్ధ సాహితీవేత్తలు కొడవటిగంటి కుటుంబరావు, రావూరి భరద్వాజ వంటి ప్రముఖులు తమ రచనల్లో చాటారు. ఆ ఘనతకు లోటు లేకుండా పట్టణంలో ఏకైక త్రీస్టార్ హోటల్ గౌతమ్‌గ్రాండ్ విందు వినోదాలకు, శుభకార్యాలకు అనువైన వేదికగా నిలిచింది. ప్రస్తుతం నాన్‌వెజ్ వంటకాలకు బిర్యానీస్, హైదరాబాద్ బిర్యానీ వంటి హోటళ్లు అందుబాటులో ఉన్నాయి. ఆహార రంగంలో శశి గ్రూపు సంస్థలు తెనాలి ఖ్యాతిని నిలబెడుతున్నాయి. స్వీట్లు, కేక్‌ల తయారీలో ప్రసిద్ధి చెందిన ఈ సంస్థ వెజిటేరియన్ వంటకాలతో పాటు తెలుగువారి పండుగలకు ప్రత్యేకమైన పిండివంటలను ప్రజలకు అందిస్తోంది. సంక్రాంతికి స్వచ్ఛమైన నేతి అరిసెల ప్రకటనతో ఊరిస్తోంది.

ఎందరో శిల్పకారులకు తెనాలి నిలయం. దేవతల శిల్పాలు, విగ్రహాలు, జాతినేతల విగ్రహాల కాంస్య విగ్రహాల తయారీకి తెనాలి పెట్టింది పేరు.

ఆ బాటలో స్థానిక సూర్యశిల్పశాల మరింత ముందడుగు వేశారు. కాంస్య విగ్రహాలు, ఇనుప వ్యర్థాలతో విగ్రహాలు, త్రీడీ విగ్రహాల రూపకల్పనలో జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు. దాల్‌మిల్లుల పరిశ్రమలో తెనాలి పేరు మార్మోగుతుంటుంది. మినపగుళ్ల తయారీలో పేరొందిన సంస్థలు ఇక్కడున్నాయి. బుర్రిపాలెం రోడ్డులోని దాల్‌మిల్లులు వినియోగదారుల ఆదరణను పొందుతున్నాయి.

సుగంధ, మాంగో, ఆరెంజ్ వంటి శీతల పానీయాల తయారీలోనూ మన్నికతో ఫెర్రీ జ్యూసెస్ వినియోగదారులను ఆకర్షిస్తోంది. ఇక టూర్స్ అండ్ ట్రావెల్స్ రంగంలోనూ తెనాలికి మంచి గుర్తింపు ఉంది. ఈవిధంగా అన్ని రంగాల్లోనూ ఆంధ్రాప్యారిస్ తన ఖ్యాతిని నిలుపుకుంటూ రావటం గర్వకారణం.


చారిత్రక ప్రసిద్ధి చెందిన శ్రీరామేశ్వర దేవాలయం